మెట్టపై రాజన్న ముద్ర

• ఉదయగిరి రచ్చబండకు వస్తూ..శాశ్వతంగా దూరం • వైఎస్సార్ వర్ధంతి నేడు


వైఎస్సార్ మంజూరు చేసిన ఉదయగిరి ట్యాంక్‌బండ్

ఉదయగిరి: మోముపై చెరగని చిరునవ్వు...తెలుగుదనం ఉట్టిపడే పంచెకట్టు.. నడకలో రాజసం.. నమ్ముకున్న వారిని ఆదరించే గుణం...మాట తప్పని మడమ తిప్పని నైజం..రైతులు, కార్మిక, కర్షకుల కోసం పరితపించే గుణం..ఈ లక్షణాలన్నీ మహానేత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సొంతం. తనకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్న ఆయన సీఎంగా వారి రుణం తీర్చుకునేలా అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించారు. ఉమ్మడి రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి దిశగా పయనింపజేశారు. నిత్యం ప్రజల కోసం పరితపించే నేతగా వారి సమస్యలను రచ్చబండ కార్యక్రమం ద్వారా తెలుసుకునేందుకు ఉదయగిరికి వస్తూ 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ దుర్ఘటనలో మరణించారు. ఆయన శాశ్వతంగా దూరమై నేటికి పదహారు వసంతాలు. ఉదయగిరి మెట్టప్రాంతంపై తనదైన ముద్ర వేసిన రాజన్న ప్రజల మదిలో నేటికి గూడు కట్టుకుని ఉన్నారు.

మెట్టప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి

ఉదయగిరి నియోజకవర్గానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. మేకపాటి సోదరులతో ఉన్న సన్నిహిత సత్సంబంధాలతో ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. బీడు బారిన భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేశారు. సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి


ఉదయగిరిలో ప్రజాపథంలో పాల్గొన్న వైఎస్సార్ (ఫైల్‌ఫోటో)

రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చేశారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు 2018 డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉన్నా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తి కాలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగొండ ప్రాజెక్ట్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రెండు టన్నెల్స్‌ను పూర్తి చేసి ప్రాజెక్ట్‌ను ఒక రూపుకు తెచ్చి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. అయితే 2024లో ప్రభుత్వం మారడంతో ప్రారంభోత్సవాన్ని చేయలేకపోయారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఉదయగిరి బీడు భూములకు వెలుగొండ జలాలు వచ్చేవి. కూటమి ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని ఈ ప్రాంత వాసులు ఆకాంక్షిస్తున్నారు. ఇది పూర్తయితే జిల్లాలో వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం సాగు నీటి పరంగా సస్యశ్యామలం అయ్యే అవకాశముంది. వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉంటే ఈ పాటికి వెలుగొండ జలాలు ఉదయగిరి వచ్చేవని ఈ ప్రాంత వాసులు చర్చించుకుంటున్నారు. వైఎస్సార్ మరణంతో ఉదయగిరి మెట్ట భూములు బీళ్లుగానే మిగిలిపోయాయి. ఉదయగిరి ముఖద్వారం వద్ద ట్యాంక్‌బండ నిర్మాణానికి నిధులు మంజూరు వైఎస్సార్ హయాంలోనే జరిగింది. పేదల కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని ఉదయగిరి నుంచే ప్రారంభించారు. ప్రజాపథం కార్యక్రమంలో భాగంగా ఉదయగిరిలో పర్యటించిన ఆయన ట్యాంక్‌బండ్ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. ఆయన మరణించి 16 వసంతాలు గడుస్తున్నప్పటికీ ఉదయగిరి నియోజవర్గానికి ఆయన చేసిన మేలు ప్రజల మనస్సుల్లో, నాలుకల్లో నిత్యం నానుతూనే ఉంది.

రచ్చబండకు వస్తూ..

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా తాను అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ప్రజల మధ్య రచ్చబండ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొట్టమొదటి రచ్చబండ ఉదయగిరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి బయల్దేరిన వైఎస్సార్ గమ్యానికి చేరకుండానే అర్ధాంతరంగా హెలికాప్టర్ ప్రమాదంలో ప్రజలకు దూరమయ్యారు. వైఎస్సార్ పేరు తలుచుకున్న ప్రతిసారి ఆనాటి ఘటన ఇప్పటికీ ప్రజలు మరిచిపోలేకపోతున్నారు.

క్లుప్తంగా

తెలుగు పండిట్‌కు సన్మానం



సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ ఎం శివశంకరయ్యను హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హర్యాన రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా తెలుగు కీర్తి పురస్కారాన్ని అందుకున్న శివశంకరయ్యను తెలుగు భాష దినోత్సవం సందర్భంగా సత్కరించి అభినందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మహేష్, రమణ రాజు, మదీనా, చంద్రశేఖర్ రెడ్డి, మాధవి, పెద్దయ్య పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్–అక్షర ఆంధ్రాపై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ గోపి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం నిరక్షరాస్యులైన వయోజనులకు అక్షరాలను నేర్పించేందుకు అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అందులో భాగంగా మండలంలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వలంటీర్ల ద్వారా అక్షరాలను నేర్పించనున్నట్లు చెప్పారు. మండల పరిషత్ ఏఓ రాజశేఖర్, ఏపీఎం సుధాకర్, వెలుగు వీఓఏలు, సీసీలు, అంగన్‌వాడీలు, సీఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణప్పపేటలో రెండిళ్లలో చోరీ



సీతారామపురం : మండలంలోని నారాయణప్పపేట ఎస్సీ కాలనీలోని శీలం రామచంద్రయ్య, మల్లాపురం చెన్నకేశవులు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.67 వేల నగదును అపహరించారు. వివరాలు.. బాధితులు పదిరోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైకు వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగివచ్చి చూడగా ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇళ్లలోని వస్తువులు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. పెట్టెల్లోని విలువైన పత్రాలతో పాటు రూ.67వేల నగదును అపహరించుకెళ్లారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజేశ్వరి సేవలు ఎనలేనివి



అనుమసముద్రంపేట(ఆత్మకూరు): ఉపాధ్యాయినిగా కర్రా రాజేశ్వరి అందించిన సేవలు ఎనలేనివని అనుమసముద్రంపేట ఎంఈఓ ఎం జ్యోతి కొనియాడారు. అనుమసముద్రం దళితకాలనీ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయిని కర్రా రాజేశ్వరి ఉద్యోగ విరమణ సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన రాజేశ్వరి శేష జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం రాజేశ్వరి, రాగయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ–2 సాయిప్రసాద్, ఉపాధ్యాయులు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఇమామ్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలి



ఉదయగిరి రూరల్: మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌లు తమకు గౌరవవేతనాలు చెల్లించాలని కోరుతూ ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ షాజియాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ మండల కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజన్‌లకు ప్రతినెలా గౌరవవేతనం అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. తొమ్మిది నెలలుగా గౌరవవేతనం చెల్లించకపోవడంతో ఇమామ్‌లు, మౌజన్లు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఆత్మకూరు: పట్టణంలోని పెద్ద మసీదు, బ్రాహ్మణవీధి, తదితర ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ఏఈ జమీలాబేగం సోమవారం పరిశీలించారు. గతంలో ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

సేవా కార్యక్రమాలతో వైఎస్సార్‌కు నివాళులర్పించండి

ఉదయగిరి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఉదయగిరిలో మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలని కోరారు. కాగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌కు నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

కలిగిరి: వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని పంచాయతీల్లో వైఎస్సార్‌కు నివాళులర్పించి సేవా కార్యక్రమాలను చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సీతారామపురం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 8:30 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో మంగళవారం 10.30 గంటలకు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మందలపు తిరుపతినాయుడు సోమవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

జలదంకి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో మంగళవారం ఉదయం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రేవనూరు శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

దళారీల దోపిడీ నుంచి రక్షించండి

అల్లూరు: దళారీల దోపిడీ నుంచి రక్షించాలని పలువురు రైతులు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇతర మండలాల కంటే అల్లూరు మండలంలో ధాన్యం ధరలను తగ్గించి రైతులను దళారులు దోచుకుంటున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు దళారులపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు పప్పు సుధాకర్, పెన్నుమల్లి శ్రీనివాసులరెడ్డి, మాధవ్


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న రైతులు

రావు, ఎరటపల్లి శేఖర్‌రెడ్డి, అంబటి రాజేంద్ర, ఆట తిరుమల తదితరులు పాల్గొన్నారు.

తల్లికివందనం వర్తింపజేయాలని వినతి

ఆత్మకూరు: తమ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే అర్చకులు ఆత్మకూరు ఆర్డీఓ బి పావనికి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల్లో పనిచేస్తే తమకు ప్రభుత్వం ధూపదీప నైవేద్యం పథకం కింద గౌరవ వేతనాలను అందజేస్తోందని తెలిపారు. ప్రభుత్వ జీఓలో రూ.12వేలకు మించి గౌరవ వేతనం అందజేస్తున్నట్లు కనబరిచిన రూ.10వేలు మాత్రమే అందజేస్తున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో తమ పిల్లలకు అమ్మఒడి పథకం వర్తింపజేసినా ప్రస్తుతం గౌరవ వేతనాలను మంజూరు చేస్తున్నారనే సాకుతో


ఆర్డీఓకు వినతి పత్రం అందజేసిన అర్చకులు

తల్లికి వందనం పథకం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తమ ఆవేదనను తీసుకెళ్లి తమ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించేలా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో రామయ్యస్వామి, కిషోర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ షేక్ హమీద్‌కు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు నియమించిన మంత్రి ఉపసంఘానికి వినతి పత్రాన్ని పంపించాలని కోరారు. ఆయన వెంట కడియాల సురేష్, గణపం రమేష్‌రెడ్డి, సూరం వినోద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి/ఉదయగిరిరూరల్: పట్టణంలోని యూనియన్‌రోడ్డుకు చెందిన షేక్ సమీవుల్లా అనే విద్యార్థి విద్యుత్ ఘాతానికి గురై ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమీవుల్లా కుటుంబ సభ్యులను మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొండా రాజగోపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించి రూ.10 వేల నగదు సాయం అందజేశారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు దస్తగిరిఅహ్మద్, కే రమణారెడ్డి, షంషీర్, నారపరెడ్డి, ఎంఎస్ సలీం, గురవయ్య, రామయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని నార్త్‌ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న షమీవుల్లా విద్యుత్


ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

షాక్‌తో మృతి చెందడంపై ఎంఈఓలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, జాఫర్‌మొహిద్దీన్, సలీం, గౌస్‌బాషా, ఉపాధ్యాయులు, తదితరులు సంతాపం తెలిపారు.

పంట కాలువల్లో పూడికతీత చేపట్టాలని వినతి

సంగం: ఎడగారుకు ముందు మంజూరైన పంట కాలువల్లో పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘునాథ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సోమ్లానాయక్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పూడికతీత పనులు చేపట్టడం ఆలస్యమైందన్నారు. ఎడగారు పంట కోతలు పూర్తైన వెంటనే పనులు చేపట్టేలా ఇరిగే



షన్ అధికారులు చర్యలు తీసుకుని మొదటి పంట సాగుకు రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. పార్టీ నాయకులు కోటారెడ్డి కరుణాకర్, రవీంద్రబాబు, అంజయ్య, జహంగీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం యనమదలకు చెందిన కేన్సర్ బాధితుడు ఉదయగిరి తిరుపతికి గ్రామస్తులు రూ.25వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ప్రతిరోజూ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునే తిరుపతి ఇటీవల ఒక్కసారిగా అనారోగ్యం పాలయ్యాడు. ఆస్పత్రికి వెళ్లి చూపించగా ఊపిరితిత్తుల కేన్సర్ సోకినట్లుగా వైద్యులు తెలిపారు. అప్పట్నుంచి నెల్లూరులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని స్థితిలో కుమిలిపోతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు మానవత్వంతో


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

స్పందించారు. సోమవారం కేన్సర్ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. దాతలు స్పందించి ఆదుకుని తిరుపతయ్య ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయండి

కావలి (జలదంకి) : కావలిలోని పెద్దపవని రైల్వేఓవర్ బ్రిడ్జిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామిక పరిరక్షణ వేదిక సభ్యులు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సుమారు 100 గ్రామాలకు రాకపోకలకు అనువైన పెద్దపవని రైల్వేఓవర్ బ్రిడ్జి సుమారు 15 ఏళ్లుగా అసంపూర్తిగా ఉందన్నారు. రైల్వేశాఖ పట్టాలపైన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసిందన్నారు. పట్టాలకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి బాధితులకు నష్టపరిహారాన్ని సైతం అందజేసిందని తెలిపారు. ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడంతో ఆస్పత్రులకు వచ్చే వారు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే కావలిలో


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ట్రాఫిక్ కష్టాలు ఉండవన్నారు. ఉదయగిరి బ్రిడ్జి పరిస్థితి కూడా బాగా లేనందున తక్షణమే పెద్దపవని రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరారు. ప్రజాస్వామిక పరిరక్షణ వేదిక కన్వీనర్ కరవాది భాస్కర్, వామపక్షాల నాయకులు దామా అంకయ్య, ఎర్రంశెట్టి కృష్ణమోహన్, బోసు, దర్గాబాబు, ఆమంచి సుబ్బు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి: పట్టణంలోని దేవలాలగడ్డకు చెందిన షేక్ గాజుల ముంతాజ్ అనే మతిస్థిమితం లేని మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గత నెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

జలదంకి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను సోమవారం అందజేశారు. వ్యాస రచనలో పదో తరగతికి చెందిన మేఘవర్షిత ప్రథమ, 9వ తరగతికి చెందిన శ్రీజ ద్వితీయ బహుమతులు సాధించారు. వక్తృత్వంలో 9వ తరగతికి చెందిన భావ్య, కుసుమాంజలి వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, విశ్రాంత వార్డెన్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు షేక్ బాషా, హెచ్‌ఎం వింధ్యావళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

కొండాపురం: మండలంలోని సత్యవోలు పంచాయతీలో ఉన్న బీబీజానమ్మ దర్గాలో గంధ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కొమ్మి గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. రజాక్, నజీర్‌బాషా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16, 17వ తేదీల్లో పెద్ద గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఐదెకరాల్లో సౌర విద్యుత్ పలకలు

సంగం: మండలంలోని రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు ఐదెకరాల్లో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయనున్నట్లు బుచ్చిరెడ్డిపాళెం డీఈ సతీష్ తెలిపారు. సోమవారం ఆయన తహసీల్దార్ సోమ్లానాయక్‌ను కలిశారు. సౌర విద్యుత్ పలకల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం ఐదెకరాల్లో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సౌర విద్యుత్‌ను 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్‌కు లింక్ చేయడం వలన సబ్‌స్టేషన్‌పై అదనపు భారం తగ్గుతుందన్నారు. ఆయన వెంట ఏఈ మన్మథరావు ఉన్నారు.

నివేశన స్థలాల మంజూరుకు వినతి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అర్హులైన పేదలకు నివేశన స్థలాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలాలు కేటాయిస్తామని, గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీని ఇచ్చిందని గుర్తుచేశారు. పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి నాగరాజు, హజరత్తయ్య, చెంచయ్య, నాగేంద్ర, మాలకొండయ్య, రమణయ్య, ఎస్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి

కావలి (జలదంకి): దగదర్తి–రాచర్లపాడు (డీఆర్) చానల్‌కు సంబంధించి పాత ప్రతిపాదనలను తుంగలో తొక్కి కొత్త ప్రతిపాదనలతో నాసిరకంగా పనులు చేపడుతూ రైతులకు అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆరోపించారు. డీఆర్ చానల్ పనులను నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కావలి ఇరిగేషన్ కార్యాలయంలో డీఈ ముజాయిద్దీన్‌ఖాన్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. నాసిరకంగా పనులు చేపడితే రైతులకు నష్టం జరుగుతుందన్నారు. రైతులకు నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని, ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు.

ఏపీహెచ్‌ఎంఏ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సోమవరపు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఏపీహెచ్‌ఎంఏ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్రాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నెల్లూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన

కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఐవీ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సార్డ్స్ ప్రతినిధులు బెనోమి, సునంద, సుస్మిత, త్రివేణి, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కావలి (జలదంకి) : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సామాజికవేత్త మాలకొండారెడ్డి పేర్కొన్నారు. కావలిలోని పంచాంగం వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, అంగన్‌వాడీలు రమణమ్మ, ఎస్‌కే సత్తార్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తుల ప్రదర్శన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. కాటేపల్లి, వింజమూరు, బుక్కాపురం, ఊటుకూరు పంచాయతీల్లోని రైతులు ప్రకృతి విధానంలో పండించిన కూరగాయలను ప్రదర్శించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సోమవారం స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ ఇన్‌చార్జిలు కే వెంకట్రావు, మహేంద్ర, ఐసీఆర్పీలు అనూష, కుమారి, దివ్య, వేదావతి, యస్ స్వప్న, నవ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు–ఇద్దరికి తీవ్రగాయాలు


దెబ్బతిన్న బైక్



క్షతగాత్రులు పవన్,పెంచలయ్య

సోమశిల: అనంతసాగరం మండలం శంకరనగరంలో సమీపంలో సోమవారం బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గౌరవరానికి చెందిన విద్యుత్‌లైన్‌మెన్ మనుబోటి పెంచలయ్య శంకరనగరానికి చెందిన పవన్ కలిసి బైక్‌పై ఆత్మకూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో శంకరనగరం మలుపు వద్ద ఆత్మకూరు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత ఆత్మకూరులోని వైద్యశాలకు తరలించారు. అనంతరం కాలు విరిగిన పవన్‌ను నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.